

కోటప్పకొండలో ప్రొబేషనరీ డీసీలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని ప్రకృతి పర్యావరణ కేంద్రాన్ని శిక్షణలో ఉన్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం సందర్శించారు. ప్రాక్టికల్ ట్రైనింగ్ లో పాల్గొన్నారు.



రెండు కరోనా కేసులు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం రెండు కరోనా పాజిటివ్ కేసులు మంగళగిరిలో నమోదయ్యాయి. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
బాపట్ల	6:24	4:52
గుంటూరు	6:24	4:52
నరసరావుపేట	6:25	4:49

న్యూస్‌రీల్

1,09,245 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,06,781 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,09,245 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 85,497 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



అద్దంకి అంజమ్మ (ఫైల్)

అద్దంకి రూరల్: అద్దంకిలోని దామావారిపాలెం బ్రహ్మంగారి దేవస్థానం వద్ద నివాసం ఉంటున్న శతాధిక వృద్ధురాలు అద్దంకి అంజమ్మ (109) గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్లు కలిపి మొత్తం 40 మంది వరకు సంతానం ఉన్నారు. ఆమె భర్త నారాయణ 30 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు అన్ని నెరవేర్చింది. ఎప్పుడూ ఎలాంటి అనారోగ్యానికి గురికాలేదని, రెండురోజుల క్రితం వరకు తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

భూమిని స్వాధీనం చేస్తూ కోర్టు తీర్పు

ఫిరంగిపురం: 72 ఏళ్ల సుదీర్ఘ విచారణ తరువాత ప్రభుత్వ భూమిని పంచాయతీకి స్వాధీనం చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన చెరువు కింద ఉన్న భూమి తమదేనంటు గ్రామానికి చెందిన వ్యక్తులు కోర్టులో 1951లో కేసు వేశారు. దీనిపై 2011న దావా వేశారు. వేములూరిపాడు(హ్యామలేట్) అమీనాబాద్ పంచాయతీ పరిధిలోని చెరువుభూమి సర్వేనెం 473లో 10.56సెంట్లు, 474లో 36.65సెంట్లు మొత్తం 47.21సెంట్లు భూమికి సంబంధించి వాదిగా ఎస్.వెంకటపార్థసారధికాగా, ప్రతివాదులుగా జిల్లా కలెక్టర్‌తోపాటు గ్రామానికి చెందినవారు ఉన్నారు. ప్రభుత్వం తరపున అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ బాలిషైద్ తన వాదనలు వినిపించడంతో భూమిని పంచాయతీకి స్వాధీనం చేస్తూ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ భూమి 47.21 సెంట్ల చెరువు భూమి ద్వారా రెండు గ్రామాలకు నీరు అందుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.7,000, గరిష్ట ధర రూ.9,200, మోడల్ ధర రూ.8,000 వరకు పలికింది.

వీఆర్‌ఓకు మూడేళ్ల జైలు

నరసరావుపేట టౌన్: చీటింగ్ కేసులో వీఆర్‌ఓకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా జడ్జి ఒ.వెంకటనాగేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ వీఆర్‌ఓ విధులు నిర్వహిస్తున్న కావూరు ముత్తయ్య తనకు రెండెకరాల ప్రభుత్వ భూమి ఇప్పిస్తానని నమ్మబలికి రూ.2 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు గుంటూరుకు చెందిన చంద్రమ్మ 2014 సంవత్సరంలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన యడ్లపాడు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో 5 నవంబర్ 2015న చిలకలూరిపేట కోర్టు నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. తీర్పుపై నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన తీర్పును యథావిధిగా ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

ముగ్గురూ గెలిచారు

ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మర్రి రాజశేఖర్, ఏసురత్నం, పోతుల సునీత



మర్రి రాజశేఖర్



ఏసురత్నం



పోతుల సునీత

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన ముగ్గురూ విజయకేతనం ఎగురవేశారు.. మరెవరికీ సాధ్యం కాని రీతిలో సామాజిక న్యాయం పాటించిన సీఎం వైఎస్ జగన్ ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి అవకాశమివ్వగా, వారిలో ఇద్దరు బీసీ వర్గాలకు చెందినవారే ఉండడం గమనార్హం. వీరిలో మర్రి రాజశేఖర్, ఏసురత్నంలు కొత్తగా పెద్దల సభలో అడుగుపెడుతుండగా, పోతుల సునీత మూడోసారి గెలిచారు. ఈ ముగ్గురూ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా గెలవడం విశేషం.

- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు దక్కిన పదవులు
- అన్నీ ఎమ్మెల్యే కోటాలోనే...

సాక్షి ప్రతినిధి, గుంటూరు/బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో నిలిచిన ముగ్గురూ గెలిచారు.. ఎమ్మెల్యే కోటాలో మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీతలు గెలుపొందారు. గత నెల 20న ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు, పల్నాడు, బాపట్లకు ఒక్కో సీటు కేటాయించారు. ఒక్కొక్కరు 22 ఓట్లతో గెలుపొందారు. మొత్తం ముగ్గురు ఎమ్మెల్సీలు గెలిస్తే అందులో ఇద్దరు బీసీ వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం. గుంటూరు జిల్లా నుంచి మాజీ పోలీసు అధికారి, గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పల్నాడు నుంచి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్, బాపట్ల నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత గెలుపొందారు.

విధేయతకు పట్టం..

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మర్రి రాజశేఖర్‌కు ఈసారి ఎమ్మెల్సీ పట్టం దక్కింది. న్యాయవాద పట్టా పుచ్చుకున్న ఆయన 2003 వరకు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 1983 సంవత్సరంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా వ్యవహరించిన తన మేనమామ సోమేపల్లి సాంబయ్య కుమార్తె లలితమ్మను వివాహం చేసుకున్నారు. 2004 సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఓటమి చవిచూశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి 2019 ముందు కాలం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2019కు ముందు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజియనల్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

మూడోసారి విజయకేతనం..

ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పోతుల సునీతకు మూడోసారి ఎమ్మెల్సీ పట్టం దక్కింది. బీసీ (పద్మశాలి) సామాజిక వర్గానికి చెందిన పోతుల సునీత 2017 నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతూ వస్తున్నారు. మొదట 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికైన సునీతకు 2021 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా స్థానం కల్పించారు. మళ్లీ తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నిక అయ్యారు.

పోలీసు నుంచి పెద్దల సభకు..

పోలీసు అధికారిగా పనిచేసిన చంద్రగిరి ఏసురత్నం డీఐజీగా పని చేస్తూ స్వచ్ఛంద విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసిన ఆయన స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం ఆయనకు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా రెండు దఫాలు అవకాశం కల్పించారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన 1982లో ఎస్‌ఐగా కర్నూల్ జిల్లాలో చేరారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రులకు సెక్యూరిటీ అధికారిగా, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీఎస్పీగా, అదనపు ఎస్పీ, ఎస్పీగా బాధ్యతలు నిర్వహించి డీఐజీగా స్వచ్ఛంద విరమణ చేశారు. ఈ ముగ్గురూ ఎమ్మెల్సీగా గెలవడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

31న పర్చూరులో మెగా జాబ్‌మేళా

పోస్టర్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ డాక్టర్ శ్రీనివాసులు

బాపట్ల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 31వతేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఈమేరకు జాబ్‌మేళా పోస్టర్లను గురువారం విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో ఈ జాబ్ మేళా ఉంటుందని, నిరుద్యోగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6302764962, 7989697996 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి 'అమ్మ' శత జయంతి ఉత్సవాలు



ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గిరిధర్, శ్రీమన్నారయణ మూర్తి

విజయవాడ కల్చరల్: బాపట్ల జిల్లా జిల్లెళ్లమూడి అమ్మ శత జయంతి ఉత్సవాలను ఈనెల 28 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు విశ్వజననీ పరిషత్ మేనేజింగ్ ట్రస్టీ పి. గిరిధర్ కుమార్ తెలిపారు. విజయవాడలోని కౌతా పూర్ణానందం విలాస్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ అమ్మ శాంతి సందేశం సమస్త మానవాళికి వినిపించడానికి ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని బాపట్ల శాసన సభ్యులు కొన రఘుపతి ప్రారంభించి, శత జయంతి విశిష్ట సంచిక ఆవిష్కరిస్తారన్నారు. ప్రచార కమిటీ కార్యదర్శి మల్లాప్రగడ శ్రీమన్నారయణ మూర్తి మాట్లాడుతూ సిద్ధేశ్వరానంద భారతి, విశ్వయోగి విశ్వంజీ, కమలానంద భారతి, సీతారామ గురుదేవులు, వాసుదేవానంద గిరి స్వామీజీల అనుగ్రహ భాషణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పులు

రంజాన్ మాసం దృష్ట్యా మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: రంజాన్ మాసం సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉర్దూ మీడియంలో నడుస్తున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం డైట్ కళాశాలలు శుక్రవారం నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కొనసాగాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాన్ని ఆచరిస్తూ, ప్రార్థనల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వివిధ ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తులతో ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవడంపై మైనార్టీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జగన్మాతకు పుష్పాభిషేకం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం దుర్గమ్మకు ఎర్రగులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మ ఉత్సవ మూర్తికి ఈ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అమ్మవారికి జరుగుతున్న విశేష పుష్పార్చనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆశీర్వచనం అందజేసిన అర్చకులు వారికి పుష్పాలను బహూకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు

- స్లిప్పులతో వచ్చిన ఐదుగురు ఇంటర్ విద్యార్థులు డీబార్
- గుంటూరులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



హిందూ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జేబులో స్లిప్పులు పెట్టుకుని ఇంటర్ పరీక్షలు రాసేందుకు వచ్చిన ఐదుగురు విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు. గురువారం జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్ 1బీ, జువాలజీ, హిస్టరీ పేపర్–1 పరీక్షలు జరిగాయి. గుంటూరు అమరావతి రోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ 1బీ పరీక్ష రాస్తూ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులతో పాటు గోరంట్లలోని శ్రీచైతన్య, చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలల్లో మరో ఇద్దరిని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు గుర్తించారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న వీరిపై మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేసిన అధికారులు పరీక్షల నుంచి డీబార్ చేశారు. గురువారం జరిగిన పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 46,763 మంది విద్యార్థుల్లో 45,614 మంది హాజరయ్యారు. 84 పరీక్ష కేంద్రాల్లో అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ విస్తృత తనిఖీలు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..

మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రతిరోజూ క్షుణ్ణంగా తనిఖీ చేసి, కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌ఐఓ జి. సునీత, చీఫ్ సూపరింటెండెంట్ వెంకట రాము, డీఓ రత్నశేఖర్ ఉన్నారు.

బడి పిల్లల డ్రాపవుట్స్ తగ్గాయి..

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా బడి పిల్లల డ్రాప్ అవుట్లు తగ్గుముఖం పట్టాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

త్రికరణ శుద్ధిగా...

పోపు డబ్బాలో దాచి చెల్లించిన సొత్తు మళ్లీ ఇంటికి చేరింది. కూలీనాలీ చేసుకుని పోగేసి కట్టిన చెమట కష్టం అరచేతిలో మెరిసింది. డ్వాక్రా రుణాలపై వడ్డీలు చెల్లిస్తున్న జగన్‌మోహనుడి రూపం ప్రతి అక్కాచెల్లెమ్మల గుండెల్లో పచ్చ బొట్టయి మెరుస్తోంది. ఇప్పటికే రెండు విడతల నగదు ఆడబిడ్డలకు అండగా నిలవగా .. మూడో విడత లబ్ధిదారుల జాబితా సచివాలయాల్లో ప్రజల ముందు నిలిచింది. 25వ తేదీన వైఎస్సార్ ఆసరా అక్కాచెల్లెమ్మల కొంగులోకి చేరి మాట తప్పని జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించనుంది.

– బాపట్ల అర్బన్

రేపు ఆసరా మూడో విడత నిధులు విడుదల

- సచివాలయాల్లో ఇప్పటికే అర్హుల జాబితా
- జిల్లాలో మూడోవిడత రూ.238.31 కోట్లు కేటాయింపు
- హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు



బాపట్లలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బొంత అర్జున కుమార్ (ఫైల్)

పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా సంఘాల అప్పులను దశలవారీగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు 2019 ఏప్రిల్ 11 నాటికి ఎంత అయితే అప్పు మిగిలి ఉంటుందో వాటిని ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా ఆయా సంఘాలకు చెల్లించేందుకు నిర్ణయించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు విడతలుగా రుణమాఫీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. తాజాగా మూడో విడత నిధులు విడుదలకు శ్రీకారం చుట్టారు.

జిల్లాలో ఇలా..

బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో 25 మండలాలు ఉన్నాయి. తొలి దశలో 27,643 సంఘాలకు రూ. 236.76 కోట్లు, రెండో దశలో రూ.239.98 కోట్లు అక్కచెల్లెమ్మలకు అందించారు. ప్రస్తుతం మూడో విడతకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.238.31 కోట్లకుపైగా నిధులు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. అయితే సంఘాల తీర్మానంతో సభ్యుల ఖాతాకు బ్యాంకర్లు జమ చేసే అవకాశం ఉంది. పలు సంఘాల లీడర్లు మొదటి విడత రెండో విడత ఆసరా నిధులు బ్యాంకు నుంచి నేరుగా తీసుకున్నారు. అర్హుల జాబితా రూపకల్పనలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సచివాలయాల వద్ద జాబితాలను అందుబాటులో ఉంచారు. సభ్యులు మరణిస్తే నామినీలకు సదరు సొమ్మును జమ చేస్తారు.

మూడో విడతలో లబ్ధి పొందే సంఘాల వివరాలు ఇలా...

నియోజక వర్గం	సంఘాలు	రూ. కోట్లు
అద్దంకి	5,272	42.25
బాపట్ల	3,452	32.51
చీరాల	2,872	22.04
పర్చూరు	5,975	50.88
రేపల్లె	4,890	43.30
వేమూరు	5,169	47.34

మొదటి, రెండో విడతల్లో లబ్ధి పొందిన సంఘాలు వివరాలు (రూ.కోట్లల్లో)

- రేపల్లె నియోజకవర్గంలో 2020–21 కి 4,893 సంఘాలకు మొదటి విడత రూ.43.08 కోట్లు, 2021–22 రెండో విడత రూ.43.53 కోట్లు లబ్ధి పొందారు
- వేమూరు నియోజకవర్గంలో 2020–21కి 5,173 సంఘాలకు మొదటి విడత రూ.46.48 కోట్లు 2021–22 రెండో విడత రూ. 48.22 కోట్లు లబ్ధి చేకూరింది.
- బాపట్ల నియోజకవర్గంలో 2020–21కి 3,554 సంఘాలకు మొదటి విడత రూ. 42.11 కోట్లు 2021–22 రెండో విడత రూ. 42.40 కోట్లు లబ్ధి పొందారు.
- చీరాల నియోజకవర్గంలో 2020–21కి 2,872 సంఘాలకు మొదటి విడత రూ.21.96 కోట్లు, 2021–22 రెండో విడత రూ. 22.12కోట్లు లబ్ధి పొందారు.
- పర్చూరు నియోజకవర్గంలో 2020–21కి 5,877 సంఘాలకు మొదటి విడత రూ. 50.62 కోట్లు, 2021–22 రెండో విడత రూ.51.13కోట్లు లబ్ధి పొందారు.
- అద్దంకి నియోజకవర్గంలో 2020–21 కి 5,274 సంఘాలకు మొదటి విడత రూ. 42.11 కోట్లు, 2021–2022 రెండో విడత కే, 42.40 కోట్లు లబ్ధి పొందారు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా అమలు



డ్వాక్రా సంఘాల్లో సభ్యులై 2019 ఎన్నికల నాటికి రుణం ఉన్న సభ్యులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వైఎస్సార్ ఆసరా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నాం. మూడో విడతకు జాబితాలు సిద్ధం చేశాం. సచివాలయంలో అర్హుల జాబితా ప్రదర్శనగా ఉంచాం. లబ్ధిదారులు జాబితాలను పరిశీలించుకొని సమస్యను తెలియజేస్తే పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చాం.

– అర్జున్‌రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్డీఏ, బాపట్ల జిల్లా

క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే ఉపేక్షించం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే ఊపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం బెట్టింగ్‌లకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. సరదాగా మొదలుపెట్టి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు యువత బానిసలవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌లపై నిషేధం విధించారన్నారు. ఒకసారి ఆడిచూద్దాం అని సరదాగా మొదలుపెట్టి వీటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయం అన్నారు. ఈ బెట్టింగ్స్ కి అలవాటు పడ్డ వాళ్లు అప్పుల పాలు కావడమే కాకుండా.. చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజల్లో క్రికెట్‌కు ఉన్న మక్కువను ఆసరాగా తీసుకొని క్రికెట్ బెట్టింగ్ ముఠాలు ఐపీఎల్ సీజన్‌ను ఎలాగైనా క్యాష్ చేసుకోడానికి సిద్ధంగా ఉంటాయన్నారు. అందుకే దీనిపై పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు ముందుగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజలు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బాపట్లఅర్బన్: జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యా శాఖ అధికారి, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.వి.జె.రామారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉన్న నాలుగు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసిన పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామన్నారు. దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్// సైట్ ద్వారా పొందవచ్చు అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందుతోందన్నారు. సంబంధిత విద్యాలయం నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చన్నారు. ఇతర వివరాలకు 9502877357 నంబరులో సంప్రదించాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

జిల్లా సహకార శాఖాధికారి రామారావు



కారంచేడు: గ్రామ సచివాలయాల సిబ్బంది తమ విధుల పట్ల బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని, అలాంటి వారిపై తగు చర్యలు తప్పవని జిల్లా సహకార శాఖాధికారి కేవీ రామారావు హెచ్చరించారు. మండలంలోని కుంకలమర్రు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో సిబ్బంది ఎంత మంది ఉన్నారో, వారి విధులు అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. వచ్చిన అర్జీలను వెంటనే విచారణ చేసి పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే విధిగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ, వైద్యశాఖతో సమన్వయంగా పనిచేస్తూ రక్తహీనతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాన్ని 'క్షయ'ం చేసుకోవద్దు

- అప్రమత్తంగా లేకపోతే టీబీ ప్రాణాలు తీస్తోంది
- ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు
- నేడు వరల్డ్ టీబీ డే

గుంటూరు మెడికల్: భారతదేశంలో ప్రతి ఏడాది ఐదు వేల మంది క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రతిరోజూ దేశ వ్యాప్తంగా వెయ్యి కంటే ఎక్కువ మంది టీబీతో చనిపోతున్నారు. ప్రతి పది నిమిషాలకు ఇరువురు టీబీతో మరణించడం చాలా బాధాకరం. గుంటూరు జిల్లాలో 2021లో 30,476 మందికి టీబీ అనుమానిత కేసులుగా భావించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా, 9,622 మందికి టీబీ నిర్ధారణ అయింది. 2022లో 28,900 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా, 9,525 మందికి టీబీ నిర్ధారణ అయింది. 2023లో జనవరి నుంచి ఫిబ్రవరి వరకు 4,225 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయగా, 1,225 మందికి టీబీ నిర్ధారణ అయింది. క్షయవ్యాధి (టీబీ)కి కారణమయ్యే బ్యాక్టీరియా ట్యూబర్‌క్యులోసిస్‌ను 1862 మార్చి 24న బెర్లిన్‌కు చెందిన డాక్టర్ రాబర్ట్‌కోచ్ కనుకొన్నాడు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏటా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఉచిత పరీక్షలు

జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ జబ్బు సోకిందా లేదా అని నిర్ధారించే కళ్లె పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. కళ్లె పరీక్ష, ఎక్సరే ద్వారా వ్యాధిని నిర్ధారించి వ్యాధి ఉన్నవారికి మందులను కూడా ఉచితంగా అందజేస్తారు. మందులు ఆరు నెలల నుండి ఎనిమిది నెలలపాటు క్రమం తప్పకుండా వాడాలి. మధ్యలో మందులు మింగటం ఆపివేస్తే వ్యాధి ముదిరిపోయి ప్రాణాంతకం అవుతుంది. అప్పుడు నయం చేయటం చాలా కష్టం అవుతోంది. మందులను ఆరోగ్య కార్యకర్తలే ఇళ్ల వద్దకు వచ్చి వ్యాధిగ్రస్తుల చేత మింగిస్తారు.వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు మింగటం ద్వారా నయం అవుతుంది. 2020లో క్రమం తప్పకుండా మందులు వాడినవారిలో 92 మంది, 2021లో 92 మంది, 2022లో 93 మంది విజయవంతంగా టీబీ నుంచి విముక్తి పొందారు. హెచ్ఐవి ఉన్నవారిలో 80 శాతం మందికి క్షయ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. పొగతాగేవారికి, టీబీ రోగులకు వైద్యం అందించే వారికి, షుగర్‌వ్యాధి ఉన్నవారికి మూడు శాతం టీబీ సోకే అవకాశాలు ఉన్నాయి. సీబీ న్యాట్ వైద్య పరికరం ద్వారా హెచ్ఐవి బాధితులకు క్షయనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.



క్షయవ్యాధిని తెలియజేసే పోస్టర్లు

లక్షణాలు ఇలా....

రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతిలోనొప్పి, బరువు తగ్గిపోవటం, ఆకలి మందగించటం, రాత్రి వేళల్లో జ్వరం రావటం, చమటలు పట్టడం క్షయవ్యాధి లక్షణాలు.వ్యాధి సోకిన వారు దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపరలు మీద పడటం ద్వారా వ్యాధి సోకుతుంది. ధూమపానం, మద్యపానం లాంటి చెడు వ్యసనాలు ఉన్నవారికి, హెచ్ఐవి బాధితులకు టిబి వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

ఉచితంగా పౌష్టికాహారం



ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా పౌష్టికాహార పదార్థాల కిట్‌ను అందజేస్తోంది. జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో 1200 మందికి ఆరు నెలలపాటు పౌష్టికాహార కిట్‌లను అందజేశారు. అంతేకాకుండా ప్రతినెలా ఒక్కో పేషెంట్‌కు రూ. 500లు చొప్పున ఆరు నెలలకు గాను జిల్లాలో గత ఏడాది రూ. 84 లక్షలు పారితోషికంగా అందజేశారు. టీబీ వ్యాధి నిర్ధారణ చేసే ప్రైవేటు వైద్యులకు, టీబీ మందులు అందిస్తున్న వైద్య సిబ్బందికి ఇన్‌సెంటీవ్‌లు అందిస్తున్నాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, గుంటూరు

నేడు టీబీ అవగాహన ర్యాలీ



వరల్డ్ టీబీ డే సందర్భంగా శుక్రవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి గుంటూరు జీజీహెచ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నాం. గుంటూరు జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో టీబీ నియంత్రణ కోసం కృషి చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందిస్తాం. వ్యాసరచన, ఇతర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తున్నాం.

– డాక్టర్ బండారు సుబ్బారావు, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి

భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం

మార్టూరు: జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజ్ వద్ద గురువారం తెల్లవారు జామున మార్టూరు పోలీసులు భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయం సమాచారం మేరకు.. రోజువారీ తనిఖీలో భాగంగా పోలీసులు టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచగా విశాఖపట్నం నుంచి కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు వెళ్తున్న లారీని అధికారులు ఆపి తనిఖీ చేశారు. జిప్సం అడుగున ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 180 కేజీలు ఉన్నట్లు అంచనా. నిందితులను నేడో రేపో అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం.

నెలాఖరులోపు పెండింగ్ పనులు పూర్తిచేయాలి

జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

మార్టూరు: ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీలోపు పూర్తవుతున్నందున వ్యవసాయ సిబ్బంది రైతులకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్టూరు సబ్ డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ పథకంలో ఈ-కేవైసీ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. లేకుంటే రైతుకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరవని తెలిపారు. శనగ పంటను ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడం కోసం పంటల నమోదును ఆర్బీకే సిబ్బంది పూర్తి చేయా లని అన్నారు. పెండింగ్ గ్రూపులు పూర్తి చేసి వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఏడీఏ శ్రీనివాసరావు ఉన్నారు.

సముద్ర తాబేళ్లను సంరక్షించుకోవాలి



సముద్రంలోకి వదిలి పెడుతున్న రేంజ్ ఆఫీసర్ జాన్సన్

చినగంజాం: సముద్ర తాబేళ్లు అంతరించి పోకుండా సంరక్షించుకోవాల్సిన అవసరం మనపై ఉందని చీరాల రేంజ్ బాపట్ల డివిజన్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై జాన్సన్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ, సోషల్ ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కుంకుడుచెట్లపాలెం సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంతతి సంరక్షణ కేంద్రం నుంచి 90 ఆలీవ్ రెడ్లీ పిల్లలను సముద్రంలోకి సురక్షితంగా వదలి పెట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ సముద్ర తాబేళ్ల సంతతి సంరక్షణ కేంద్రంలో మొత్తం 16 తల్లి తాబేళ్ల నుంచి 1617 గుడ్లు సేకరించి వాటి నుంచి 390 పిల్లలను తయారు చేశామని, వాటిని సురక్షితంగా సముద్రంలోకి నాలుగు సార్లుగా వదలిపెట్టినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాల సమన్వయ కర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల సంరక్షణ దళం సభ్యులు కారాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతిభలో గ్రేట్ స్వప్న మాధురి

- జాతీయ స్థాయిలో 64 ర్యాంకు కైవసం
- ర్యాంక్ కార్డు అందుకున్న చల్లా స్వప్న మాధురి



సత్తెనపల్లి: ఇంజనీరింగ్, సైన్స్ కోర్సుల్లో ప్రతిభను గుర్తించేందుకు నిర్వహిస్తున్న గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) పరీక్షల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థిని సత్తా చాటింది. ఈ నెల 16న గేట్ ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ స్థాయిలో లక్షలాది మంది విద్యార్థులు పోటీపడి రాసే ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి 64 ర్యాంక్ కైవసం చేసుకుంది. గేట్‌లో ప్రతిభ చాటుకుంటే పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో కొలువు దగ్గడమే కాక, సీఎస్ఐఆర్ స్పాన్సర్డ్ ప్రాజెక్టుల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అందజేస్తారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీల్లో కొలువులు దక్కాలంటే గేట్‌లో అర్హత తప్పనిసరి. 67.67 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 64వ ర్యాంక్‌తో ప్రతిభ చూపిన స్వప్న మాధురిని, ఆమె తల్లిదండ్రులు చల్లా శ్రీనివాసరావు, అనురాధ దంపతులను పలువురు గురువారం అభినందించారు.

కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోండి

కొరిటిపాడు(గుంటూరు): ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో పప్పుశనగ కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఆర్.జె.కృష్ణారావు కోరారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. క్వింటా రూ.5,335 ప్రకారం 8 కేంద్రాల ద్వారా పప్పు శనగ కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, గుంటూరు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమానులలో ఆయా రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం యాప్‌లో 456 మంది రైతుల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. వ్యర్థ పదార్థాలు ఒక శాతానికి మించి ఉండకూడదని, తేమ 14 శాతం మించి ఉండకూడదని వెల్లడించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి తీసుకువచ్చిన పప్పుశనగను కొనుగోలు చేసి ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లోకి చెల్లింపులు చేస్తామని తెలిపారు.

బోధనా విధానంలో విషయ పరిజ్ఞానం లోపం



పరిశోధనా పత్రాల సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, సదస్సు డైరెక్టర్ బ్రహ్మాజీరావు

ఏఎన్‌యూ: ఉన్నత విద్యలో చాలా మంది అధ్యాపకులు బోధనలో విషయ పరిజ్ఞాన లోపం ఉంటోందని వీసీ ఆచార్య పి రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ' పర్‌స్పెక్టివ్స్ అండ్ చాలెంజెస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును గురువారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఉన్నత విద్యా బోధకుల ఆలోచన విధానం మారితే తప్ప ఈ రంగంలో ఆశించిన ఫలితాలు సాధించలేమన్నారు. ఉన్నత విద్యలో విద్యార్థులు, యువకుల్లో అనేక అంశాల్లో పరిజ్ఞానం ఉంటుందని కానీ దానిని చాలా మంది అధ్యాపకులు కనీసం అంగీకరించే పరిస్థితి లేదన్నారు. కేంద్రియ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలలో అధ్యాపకుడు, విద్యార్థి ఎంతో సన్నిహితంగా ఉంటారని, విద్యార్థి వ్యక్తం చేసిన నూతన అంశాలు, విషయ పరిజ్ఞానంపై అధ్యాపకుడు అతనితో కలిసి సుదీర్ఘంగా చర్చించే పరిస్థితి ఉందన్నారు. అవసరం అనుకుంటే విద్యార్థి ఆలోచన, నూతన అంశాలను అధ్యాపకుడు తన పుస్తకంలో పొందుపరచుకునే పరిస్థితి కూడా ఉందన్నారు. అందుకే అక్కడి విద్యార్థులు ఎంతో నైపుణ్యవంతులు అవుతున్నారన్నారు. కానీ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలలో పూర్తిగా దానికి భిన్నమైన పరిస్థితులు మనం చూస్తున్నామని చెప్పారు. చాలా మంది అధ్యాపకులు తాము బోధించాల్సిన విషయాల కంటే అనవసరమైన అంశాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. అధ్యాపకులు సానుకూల దృక్పథాన్ని, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞానమే అధ్యాపకుడి సద్భావనను తెలియజేస్తుందన్నారు. కఠోర శ్రమ, విజ్ఞానం పెంపొందించుకోవడం, నూతన అంశాల అధ్యయనం వంటి అంశాలు విద్యార్థిని ఉన్నతుడిగా తీర్చిదిద్దుతాయన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఏ రామకృష్ణ కీలకోపన్యాసం చేస్తూ విద్యార్థులు, యువత సరైన నిర్ణయాలు తీసుకోకపోతే ఆ సమాజం పరిపూర్ణతను సాధించలేదన్నారు. విద్యార్థులు నిర్ణయాత్మక శక్తిగా ఎదిగే విధంగా ఉన్నత విద్యలో అధ్యాపకులు వారిని ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ రెండు రోజులపాటు జరిగే సదస్సులో దేశ వ్యాప్తంగా 65 మంది పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారని తెలిపారు. బీహార్ మౌలానా అజాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య పి ఆడంపాల్, కేరళ మహాత్మాగాంధీ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ఇస్మాయిల్ థామరాస్సెరి, ఏఎన్‌యూ ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ జేఆర్ ప్రియదర్శిని, పలువురు అధ్యాపకులు ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు.

ఈదురుగాలుల బీభత్సం

రొంపిచర్ల: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం గురువారం మండలంలో బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మేఘావృతమై చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. ఒక్కసారిగా ఈదురు గాలులు బలంగా వీయటంతోపాటు ఉరుములు, మెరుపులు రావటంతో ప్రజలు భయాందోళన చెందారు. మండలంలోని మునమాక, విప్పర్లపల్లి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు నేలకూలాయి. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామ సమీపంలోని పొలాల్లో ధాన్యపు రాశులకు పట్టలు కప్పేందుకు వెళ్లిన షేక్ కరీంసా, షేక్ జాన్‌సైదులు సమీప ప్రాంతంలో పిడుగులు పడటంతో షాక్‌కు గురై ఇరువురికి గాయాలయ్యాయి. స్కూల్ బస్సులు నరసరావుపేట నుంచి విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, తురిమెళ్ల, అలవాల, అచ్చయ్యపాలెం, సుబ్బయ్యపాలెం వెళ్లే గ్రామాల ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు కూలడంతో వాహనాలు నిలిచిపోగా, విద్యార్థులు, ప్రయాణికులు పడిపోయిన చెట్ల కిందగా అతి కష్టంపై వెళ్లాల్సి వచ్చింది. సాయంత్రం వరకు ఈ రహదారిలో చెట్లు తొలగింపు జరగలేదు. ఈదురుగాలులకు రేకుల ఇళ్లు లేచిపోయాయి. పొలంలో ఉన్న మొక్కజొన్న పైరు కూడా పూర్తిగా నేలకొరిగింది. విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది.